క్లుప్తంగా

పూణేలో పీఠాధిపతి ప్రత్యేక పూజలు


హారతులిస్తున్న పీఠాధిపతి సుభుధేంద్రతీర్థులు

మంత్రాలయం రూరల్: శ్రీ రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి శ్రీ సుభుధేంద్రతీర్థులు మహారాష్ట్ర పర్యటనలో భాగంగా పూణేలోని వరధేంద్రమఠాన్ని సందర్శించారు. ముందుగా వరధేంద్రతీర్థుల మూలబృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మూలరాములకు హారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు పీఠాధిపతి శ్రీ సుభుధేంద్రతీర్థులు ఫలమంత్రాక్షితలిచ్చి ఆశీర్వాదించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

కౌతాళం:స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడని హెచ్‌ఎం గౌరమ్మ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ 9వ తరగతి విద్యార్థి కె.టి.మల్లికార్జున ఈనెల 23నుంచి 25వ తేదీ వరకు విజయనగరంలో జరగనున్న అండర్– 17 కబడ్డీ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాడని చెప్పారు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారని పేర్కొన్నారు.అనంతరం మల్లికార్జునను సన్మానించారు. కార్యక్రమంలో పీడీ ఈరన్న, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, కల్యాణ్ పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతోనే విజయం


క్రీడలను ప్రారంభిస్తున్న జయమనోజ్‌రెడ్డి, పాఠశాల డైరెక్టర్లు

ఆదోని అర్బన్ : ఆత్మవిశ్వాసంతోనే విద్య, క్రీడారంగంలో విజయం సాధ్యమవుతుందని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తనయుడు, యువ నాయకుడు జయమనోజ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కిడ్డీస్ పాఠశాలలో ఆ పాఠశాల డైరెక్టర్లు కేశవనారాయణరెడ్డి, చిన్నపురెడ్డి ఆధ్వర్యంలో ఆటల పోటీలు ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని చెప్పారు. క్రీడలతో ఆత్మవిశ్వాసం పెరగడంతో పాటు శారీరక ధృడత్వం, ఏకాగ్రత, ఆరోగ్యం పెంపొందుతుందని తెలిపారు.

టీబీపై అవగాహన

ఆదోని అర్బన్ : పట్టణంలోని ఆర్‌ఆర్ లేబర్ కాలనీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులకు టీబీపై అవగాహన సదస్సు నిర్వహించారు. వైద్యుడు బాబురాజు టీబీ వ్యాధి లక్షణాలు, నివారణకు చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రెండు వారాలకు పైగా దగ్గు, దగ్గులో రక్తపు చారలు, ఆకలి మందగించడం, బరువు తగ్గిపోవడం, ఉదయం, సాయంత్రం జ్వరం ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. నివారణ చర్యల కోసం పుట్టిన బిడ్డకు బీసీజీ వ్యాక్సిన్ వేయించాలని, దగ్గిన, తుమ్మినప్పుడు మోచేయి అడ్డుగా పెట్టుకోవాలని చెప్పారు. ఏఎన్‌ఎంలు, విద్యార్థులు పాల్గొన్నారు.

దిశ చట్టంపై అవగాహన పెంచుకోండి

మంత్రాలయం రూరల్: దిశ చట్టంపై అవగాహన పెంచుకోవాలని ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజు తెలిపారు. శుక్రవారం రాత్రి మండలంలోని చిలకలడోణ గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆపద కల్గిన సమయంలో సెల్ ఫోన్‌లోని దిశ యాప్‌లో ఎస్‌ఓఎస్ బటన్ నొక్కితే సమీపంలోని పోలీసులకు సమాచారం అందుతుందని, మిమ్మల్ని ఆపద నుంచి రక్షిస్తారని చెప్పారు. అలాగే ఇటీవల ఆన్‌లైన్‌లో రుణయాప్‌ల పేరుతో మోసం చేస్తున్నారని, వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రయాణం చేసేటప్పుడు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారుల్లో ప్రయాణించే వారు సీటు బెల్టు ధరించాలని, వాహన రికార్డులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ అంతరాయం

కోసిగి: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనులు నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల ట్రాన్స్ కో ఏఈ వీరేష్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రతి నెల విద్యుత్ సబ్ స్టేషన్ కండిషన్, వివిధ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు చేయిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సరఫరా నిలిపి వేస్తున్నట్లు పేర్కొన్నారు.

నాడు కరువు.. నేడు పంటల పండుగ

- ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి
- పట్టణంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'


సీసీ రోడ్డు, డ్రెయినేజీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే


సాయిబాబా ఎస్కేడీ కాలనీ పేదలకు పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఆదోని అర్బన్ : టీడీపీ అధికారంలోకి వచ్చిందంటే కరువు కరాళ నృత్యం చేస్తుందని, గతంలో ఇది నిరూపితమైన విషయం తెలిసిందేనని, ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్ పాలనలో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటల దిగుబడి, గిట్టుబాటు బాగుండటంతో రైతన్నలు సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. పంటల సాగులో అన్నదాతకు అడుగడుగునా అండగా ఉంటూ చేయూతనిస్తున్నారని, ఇలా ఇంతకుముందెన్నడూ జరగలేదని, రైతుల పక్షపాతిగా నిలిచిన ప్రభుత్వం తమదొక్కటేనని స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక నాలుగోవార్డు దత్తాత్రేయ ఆలయం ప్రాంతంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అలాగే కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులు, డ్రెయినేజీ, సీసీ రోడ్లు, వీధిలైట్లు పరిశీలించి పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు. ముందుగా కాలనీలో ప్రవేశించిన ఆయనకు స్థానికుల నుంచి ఘన స్వాగతం లభించింది. అవినీతిరహిత పాలనలో రాష్ట్రం దేశంలోనే ఆదర్శంగా నిలిచిందని, ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. గతంలో అభివృద్ధి అంటే కొన్ని ప్రాంతాలకు, సంక్షేమం కొందరికి మాత్రమే పరిమితై ఉండేదని, నేడు మాత్రం అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ, అన్ని ప్రాంతాలను ప్రాధాన్యత క్రమంగా అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. రైతులకు, డ్వాక్రా మహిళలకు మూడున్నర సంవత్సరాల్లోనే ఏ సీఎం చేయనటువంటి పనులు చేసి చూపించారన్నారు. ఇలాంటి అభివృద్ధి పనులు చేస్తున్న జగన్‌పై ప్రతిపక్ష నాయకులు ఓర్వలేక బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మధుసూదన్, ఆయా కార్పొరేషన్‌ల డైరెక్టర్‌లు రేణుక, మంజుల, అహ్మద్‌బాషా, సలీం, అబ్దుల్ సునార్, ఖాదర్, పట్టణాధ్యక్షుడు దేవా, కౌన్సిలర్‌లు ఉమామహేశ్వరి, గోవిందు, నాయకులు సురేష బాలాజీ, చిన్నా, సుధాకర్, అక్బర్, మాధవరెడ్డి, వీరభద్ర రెడ్డి, గౌస్, మహేష్, దస్తగిరి, లక్ష్మీనారాయణ, ఈరప్ప, యల్లప్ప పాల్గొన్నారు.

బీమా సొమ్ము అందజేత

అడ్వకేట్ వెంకటేశ్వర్లు భార్య జయసుధకు ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి శుక్రవారం స్థానిక కార్యాలయంలో వైఎస్సార్ బీమా సొమ్ము రూ.లక్ష నగదును అందజేశారు. అడ్వకేట్ వెంకటేశ్వర్లు కొన్ని రోజుల క్రితం మృతిచెందాడు. బీమా పథకం కింద మంజూరైన నగదును ఎమ్మెల్యే అందించారు. తిమ్మారెడ్డి, రాముడు,మృతుని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పట్టాల పంపిణీ

పట్టణంలోని సాయిబాబా ఎస్కేడీ కాలనీలోని పేదలకు కౌన్సిలర్ రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి శుక్రవారం పట్టాలు పంపిణీ చేశారు. గతంలో రూ.2100 కట్టిన 70 మంది లబ్ధిదారులకు ఈఎస్‌ఐ ఆస్పత్రి వెనకభాగంలో ఉన్న స్థలానికి చెందిన పట్టాలను స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అందజేశారు.

దాడి కేసులో జైలు శిక్ష


ముద్దాయితో పోలీస్

కోసిగి: దాడి కేసులో మండలంలోని కందుకూరు గ్రామానికి చెందిన కురువ రామలింగ అనే వ్యక్తికి శుక్రవారం ఆదోని జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ 4 నెలల జైలు శిక్ష విధించారని ఎస్‌ఐ రాజారెడ్డి తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన నరసింహ శెట్టి అనే వ్యక్తి గ్రామంలో కిరాణా దుకాణం నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన కురువ రామలింగ 2020 సంవత్సరంలో మద్యం సేవించి దుకాణం వద్దకు వెళ్లి అప్పు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఇందుకు ఆయన నిరాకరించడంతో కర్రతో దాడి చేయడంతో నరసింహశెట్టికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు నాడు కేసు నమోదు చేయగా, విచారణలో నేరం రుజువు కావడంతో రామలింగకు కోర్టు నాలుగు నెలల జైలు శిక్ష విధించిందని వివరించారు.

వలంటీర్ వ్యవస్థపై వాస్తవాలు ప్రజలకు తెలుసు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

మంత్రాలయం రూరల్: సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ పనితీరు గురించి ప్రజలకు వాస్తవాలు తెలుసునని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని రాంపురం గ్రామంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసేందుకు ఎల్లో మీడియా కంకణం కట్టుకొని మరీ పని చేస్తుందని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో పొత్తు లేకుండా బాబు పోటీ చేయగలడా అని ప్రశ్నించారు. చంద్రబాబునాయుడి సభలో ప్రజలు మృతి చెందితే నోరెత్తని పవన్ కల్యాణ్.. ప్రభుత్వం గురించి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ఏపీలో తెల్లవారుజాము నుంచే వలంటీర్ వ్యవస్థ అర్హులకు పింఛన్లు పంపిణీ చేస్తుందని, సచివాలయం, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు నేరుగా ఇంటి వద్దకే దాదాపు 700 రకాల సేవలను అందిస్తున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని కొనియాడారు, గతంలో చంద్రబాబునాయుడు అధికారంలో ఉండి 600 రకాల హామీలు, వాటి అమలును పట్టించుకోకపోవడంపై ఎల్లో మీడియాఎందుకు ప్రశ్నించడంలేదని నిలదీశారు. సంక్షేమ పథకాలే 2024లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తాయని స్పష్టం చేశారు.

ఉచిత వైద్యశిబిరం


డ్రైవర్‌కు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

ఆదోని అర్బన్ : ఇండియన్ మెడికల్ అసోసియేషన్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండులో ఉచిత డయాబెటీస్ నిర్ధారణ క్యాంపు నిర్వహించారు. ప్రయాణికులు, డ్రైవర్‌లు, స్థానికులకు డాక్టర్లు గోపీనాథ్, కృష్ణమూర్తి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి పలు సూచనలు చేశారు. శిబిరంలో 120 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు వైద్యులు చెప్పారు. పట్టణ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షురాలు ఉషారావు, సెక్రటరీ కిరణ్‌కుమార్, జిల్లా చైర్‌పర్సన్ ప్రసాద్‌రావు, లయన్స్ క్లబ్ జిల్లా చైర్‌పర్సన్ ప్రసాద్‌రావు, పట్టణ అధ్యక్షుడు ధర్మారెడ్డి, సభ్యులు వన్నపురాజు, గోవిందరావు పాల్గొన్నారు.

వృద్ధుడికి సపర్యలు


చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వృద్ధుడు

ఆదోని అర్బన్ : పట్టణంలో శుక్రవారం ఓ గుర్తు తెలియని వృద్ధుడు అపస్మారక స్థితిలో ఉండగా ప్రజలు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. కాగా వృద్ధుడి వివరాలు తెలియలేదు. వివరాలు తెలిసిన వారు ఆదోని ఏరియా ఆస్పత్రిలో, ఆదోని వన్‌టౌన్ పోలీసులను సంప్రదించాలని వన్‌టౌన్ సీఐ విక్రమ్‌సింహ సూచించారు.

నీటి సమస్యకు పరిష్కారం


బోరు వేస్తున్న దృశ్యం

కౌతాళం: మండలంలోని పొదలకుంట గ్రామంలో తాగునీటి ఎద్దడి నివారణకు శుక్రవారం నూతన బోరు వేశారు. గ్రామ ఎస్సీ కాలనీలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉందని స్థానికులు మల్లయ్య సోమనాథ్, లక్ష్మయ్య, తిమ్మప్ప సమస్యను ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే బోరు వేయాలని అధికారులను ఆదేశించడంతో బోరు వేశారు. దీంతో కాలనీవాసులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి పనుల పరిశీలన


ధణాపురంలో రోడ్డుపై పారుతున్న మురుగు నీటిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ గీతావాణి

ఆదోని రూరల్ : మండలంలోని విరుపాపురం, పెద్ద పెండేకల్, ధణాపురం గ్రామాలను శుక్రవారం ఎంపీడీఓ గీతావాణి సందర్శించి వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. విరుపాపురంలో మనబడి నాడు–నేడు పనులు, ఆధార్ సెంటర్‌ను పరిశీలించి సచివాలయాన్ని తనిఖీ చేశారు. అలాగే పెద్దపెండేకల్‌లో ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న హార్టికల్చర్, డ్రెయినేజీ కాలువల పనులు పరిశీలించారు. అనంతరం ధణాపురంలో హౌసింగ్ కాలనీలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలను పరిశీలించి, నిర్మాణాలకు కావాల్సిన నివేదికలు తయారు చేసి పంపుతామని చెప్పారు.

నాడు అలా.. నేడు ఇలా..


నాడు..గతుకులమయంగా ఉన్న కోసిగి-డి.బెళగల్ రోడ్డు


నేడు.. సుందరంగా మారిన దృశ్యం

మంత్రాలయం : ఆ దారిలో ప్రయాణం చేయాలంటే ఒళ్లు హూనం కావాల్సిందే. ఐదేళ్లుగా అదే నరకం. టీడీపీ ప్రభుత్వ చర్యలతో రోడ్డు నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులకు ఇక్కట్లు తప్పలేదు. పెద్దకడబూరు మండలం కంబలదిన్నె నుంచి మాలపల్లి-డి.బెళగల్ మీదుగా కోసిగి వరకు డబల్ రోడ్డు వేయాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. అయితే కేవలం దొడ్డి బెళగల్ వరకు మాత్రమే రోడ్డు వేసి వదిలేశారు. మిగిలిన 4.50 కి.మీ.దూరాన్ని పూర్తి చేయకపోవడంతో రోడ్డంతా గుంతమయమై జనం నరకయాతన అనుభవించారు. సమస్య తీవ్రతను గమనించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అసంపూర్తిగా ఉన్న దారిని పూర్తి చేసింది. ఎన్‌ఐడీఏ (నాబార్డు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ అసిస్టెన్స్) నిధులు రూ.5.50 కోట్లతో డబల్ రోడ్డు వేశారు. ప్రస్తుతం రాకపోకలు సాఫీగా సాగుతుడటంతో ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఆదర్శ పాలనతో ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం

- సీఎం జగనన్న పాలనపై ప్రజల్లో సంతృప్తి
- ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి
- కోసిగిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'


మహిళకు సంక్షేమ పథకాల వివరించే బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి

కోసిగి/మంత్రాలయం: పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదర్శ పాలన సాగిస్తూ పేదల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ఉద్ఘాటించారు. శుక్రవారం కోసిగి సచివాలయం–3 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీ మోహన్ రెడ్డితో కలిసి పర్యటించారు. గడప గడపకు తిరిగి ప్రభుత్వం అందించిన సంక్షేమ ఫలాలు, పాలన తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న పేదల అభ్యున్నతి కోసం నవరత్నాలు అమలు చేస్తున్నారని, దీంతో వారి జీవన ప్రమాణాలు ఇప్పుడిప్పుడే మెరుగుపడుతున్నాయని, మరోకొన్నేళ్లు పథకాలు ఇలాగే నిరాటంకంగా అందజేస్తే వారు ఉన్నత స్థితికి చేరుకుంటారని, అందుకు జగనన్నపై మీ ప్రేమను మరింత కొనసాగించాలని కోరారు. సంక్షేమ పథకాలతో ప్రతి పక్షాల నాయకులు, కార్యకర్తలు లబ్ధి పొందుతున్నారన్నారు. జగనన్న పాలనలో పేదలందరు మెరుగైన జీవనం సాగిస్తున్నా..పచ్చ మీడియా మాత్రం దుష్ప్రచారాలతో సంక్షేమ పాలనపై అక్కసు వెల్లగక్కడం శోచనీయమన్నారు. ప్రతి పక్ష నాయకులు ఉనికి కోసం అసత్య ప్రచారానికి పూనుకోవడం దుర్మార్గమన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయడంలో తమ ప్రభుత్వం ముందంజలో ఉందన్నారు. సంక్షేమ పథకాలే కాకుండా గ్రామాలాభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు, గ్రామ సచివాలయాలు, వివిధ కార్యాలయాలకు భవనాలు నిర్మించి అందుబాటులోకి తెచ్చామని వివరించారు. నియోజకవర్గ రైతాంగం కోసం రూ.75కోట్లతో 6 ఎత్తిపోతల పథకాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. అనంతరం సచివాలయం -3 కార్యాలయంలో ఉద్యోగులు, వలంటీర్లతో సమావేశమైయ్యారు. ప్రతి ఉద్యోగి బాధ్యతయుతంగా నడుచుకుంటూ ప్రజలకు సేవలందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బెట్టన గౌడ, సాగునీటి సంఘం మాజీ డిస్ట్రిబ్యూటర్ అధ్యక్షుడు శ్రీనివాస రెడ్డి, సీనియర్ నాయకుడు నాడుగేని నరసింహులు, ఎంపీపీ ఈరన్న, సర్పంచ్ అయ్యమ్మ, ఆర్లబండ సహకార సంఘం అధ్యక్షుడు మహంతేష్‌స్వామి, మాణిక్యరాజు,నాడుగేని నాగరాజు, జగదీష్ స్వామి, మాజీ మండల ఉపాధ్యక్షుడు హాజి ఉస్మాన్, మాజీ సర్పంచ్ యల్లయ్య, కోసిగయ్య, మంగమ్మ, భీమక్క, నాడుగేని నాగేంద్ర, ఎంపీడీఓ రాజేంద ప్రసాద్, పీఆర్ ఏఈ యుగంధర్ రెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ వీరేష్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని భక్తుడి మృతి


మృతి చెందిన భక్తుడు యోగేష్

మంత్రాలయంరూరల్: శ్రీరాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు స్వగ్రామం నుంచి మంత్రాలయం వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ పాదయాత్ర భక్తుడు మృతి చెందిన సంఘటన మంత్రాలయం శివారులోని చెట్నెహళ్లి సమీపంలో చోటు చేసుకుంది. మంత్రాలయం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం బాగల్‌కోట్ జిల్లా ఇల్కల్‌కు చెందిన యోగేష్ (25) శ్రీరాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు స్నేహితులతో కలిసి మంత్రాలయం బయల్దేరారు. శుక్రవారం రాత్రి క్షేత్రానికి రెండు కి.మీ. దూరంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని మృత్యువాత పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వివరించారు.

బాలికలు ఉన్నత స్థాయికి చేరుకోవాలి

కోసిగి: బాలికలు కష్ట పడి చదివి ఉన్నత స్థాయిలోకి చేరుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సమీరా రెడ్డి ఆకాంక్షించారు. శుక్రవారం స్థానిక మోడల్ స్కూల్‌లో స్త్రీ శిశు సంక్షేమ శాఖ సూపర్ వైజర్లు సుధావతి, సురేఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం పురస్కరించుకుని సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని కష్టపడి చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని, భవిష్యత్‌లో ఉన్నత స్థాయిలో రాణించేందుకు ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగాలని సూచించారు.

లైసెన్స్ లేని దుకాణం సీజ్


దుకాణాన్ని సీజ్ చేస్తున్న మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, సిబ్బంది

ఆదోని అర్బన్ : పట్టణంలో ట్రేడ్ లైసెన్స్ లేని దుకాణాలు, ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్న దుకాణాలపై శుక్రవారం రాత్రి మున్సిపల్ అధికారులు దాడులు చేశారు. సట్టబజార్, కూరగాయల మార్కెట్, ఎల్‌బీ స్ట్రీట్ తదితర ఏరియాల్లో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, సిబ్బందితో పాటు తనిఖీలు నిర్వహించారు. సట్టబజార్‌లోని ఓ దుకాణం ట్రేడ్ లైసెన్సు లేకుండా కొన్నేళ్లుగా నడుపుతున్నారని వెల్లడైంది. దీంతో ఆ దుకాణాన్ని సీజ్ చేశారు. అంతేగాకుండా కొన్నిచోట్ల ప్లాస్టిక్ కవర్లు వాడుతున్న మూడు దుకాణాలకు కలిపి రూ.7700 జరిమానా విధించారు. మరోసారి పట్టుబడితే దుకాణాన్ని సీజ్ చేస్తామని హెచ్చరించారు.

నిధుల కేటాయింపు పెంచాలి

పెద్దకడబూరు: ప్రస్తుతం ఉన్న వ్యయానికి అనుగుణంగా ఇళ్ల నిర్మాణాలకు నిధులు కేటాయించాలని సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి మునెప్ప, జిల్లా కార్యవర్గసభ్యుడు భాస్కర్‌యాదవ్ కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మండల కార్యదర్శి వీరేష్ అధ్యక్షతన శుక్రవారం నాయకుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ జగనన్న ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు ఏమాత్రం సరిపోవని, రూ.5లక్షలకు పెంచాలన్నారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం లౌకిక తత్వాన్ని మరచి కులాలమధ్య చిచ్చు పెడుతోందని ఆరోపించారు. అనంతరం జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకుడు మబ్బు అంజనేయ, సీపీఐ నాయకులు సర్దార్‌పటేల్, రాజు, తిక్కన్న, హనుమంతు, నాగరాజు, చంద్ర, వెంకటేష్ పాల్గొన్నారు.

26 నుంచి ఫ్లెక్సీలు నిషేధం

ఆదోని అర్బన్ : ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 26వ తేదీ నుంచి పట్టణంలో ఫ్లెక్సీలను నిషేధిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కమిషనర్ కార్యాలయంలో ఫ్లెక్సీల తయారీదారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఫ్లెక్సీల వల్ల ఎదుర్కొంటున్న సమస్యల గురించి వారికి వివరించారు. వంద సంవత్సరాలైనా ఫ్లెక్సీలు భూమిలో కలిసిపోవడం లేదని, దీంతో వాతావరణం కాలుష్యం భారీగా పెరిగిపోతుందని చెప్పారు. పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి సహకరించాలని కోరారు.

టీబీ డ్యాంలో తగ్గుతున్న నీటిమట్టం

హొళగుంద: కర్ణాటక రాష్ట్రం హొస్పేట్ వద్ద నిర్మించిన తుంగభద్ర జలాశయంలో నీటిమట్టం వేగంగా తగ్గుతోంది. ఈ ఏడాది ముందస్తు వర్షాల కారణంగా టీబీ డ్యాం ముందుగానే నిండడంతో జూలై నుంచి డ్యాం గేట్లు ఎత్తిన టీబీ బోర్డు అధికారులు దాదాపు మూడున్నర నెలల పాటు కొనసాగించారు. భారీ వర్షాల కారణంగా పలుమార్లు గరిష్ఠంగా లక్షన్నర క్యూసెక్కుల వరకు నీరు డ్యాంలోకి (ఇన్‌ఫ్లో) వచ్చాయి. గత కొద్ది రోజులుగా నీటి నిల్వ క్రమేణా తగ్గుతూ వస్తుంది. ఇన్‌ఫ్లో జీరో క్యూసెక్కులుంటే 9,228 క్యూసెక్కుల నీటిని కాలువలకు (ఔట్‌ఫ్లో) వదులుతున్నారు. ఇన్‌ఫ్లో పూర్తిగా తగ్గడంతో అక్టోబర్ 26న గేట్లన్నీ మూసివేసిన సంగతి తెలిసిందే. ఈ నెల 1వ తేదీ నాటికి ఇన్‌ఫ్లో జీరో క్యూసెక్కులుగా నమోదు కావడం, సాగు, తాగుకు డిమాండ్ పెరగడంతో రోజుకు ఒక టీఎంసీ మేర నీరు ఖాళీ అవుతోంది. 75 టీఎంసీల నీరు నిల్వ ఉంటే 20వ తేదీకి 60 టీఎంసీలకు పడిపోయింది. తుంగభద్ర డ్యాం పూర్తి సామర్థ్యం 1633 అడుగులతో 105.788 టీఎంసీలుండగ శుక్రవారం ఉదయానికి 1619.59 అడుగులతో 60.187 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గతేడాది ఇదే సమయానికి 1626.99 అడుగుల వద్ద 79.366 టీఎంసీల నీరు నిల్వ ఉండి ఇన్‌ఫ్లో 1,510 క్యూసెక్కులు ఉండేది. ఇక ఎల్లెల్సీకి ఏప్రిల్ 5వ తేదీ వరకు నీటిని విడుదల చేసేందుకు టీబీ బోర్డు అధికారులు ఇటీవలే జరిగిన ఇరు రాష్ట్రాల ఉన్నత స్థాయి అధికారుల సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. శుక్రవారం ఎల్లెల్సీ 250 కి.మీ వద్ద 532 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది.

పండ్లు, బ్రెడ్లు పంపిణీ

ఆదోని అర్బన్ : సద్గురు ఎలా లింగ మహారాజ్ 37వ పుణ్యస్మరణ కార్యక్రమం పట్టణంలో బీసీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు పండ్లు, బ్రెడ్లుతో పాటు వస్త్రాలు అందజేశారు. మురుగరాజేంద్ర శిష్య బృందం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు ఎండీ బద్రినాథ్‌స్వామి, కన్నె జగదీష్,వినోద్‌రెడ్డి,నీలకంఠప్ప, రాజశేకర్, మంజునాథ్, రాజశేఖర్ పాల్గొన్నారు.

'మధ్యాహ్నం'లో నాణ్యత పాటించండి

కౌతాళం: మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించి మెనూ ప్రకారం వంటలు వండాలని ఎంపీడీఓ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని మదిర గ్రామ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజనాలు ఎలా పెడుతున్నారు, మెనూ పాటిస్తున్నార లేదా అనే విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంట నిర్వాహకులు శుభ్రత పాటించాలని, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ అనుసరించాలని చెప్పారు. అనంతరం పాఠశాల రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల హాజరు, నాడు–నేడు పనుల గురించి ఆరాతీశారు.